పాపం మూగజీవాలు

- పశువుల అక్రమ రవాణాకు అడ్డాగా మన్యం జిల్లా
- మూడు స్టాక్ పాయింట్ల నుంచి రవాణా
- ప్రతి గురువారం సంతలో ఇష్టానుసారం క్రయవిక్రయాలు
- అనుమతులు లేకుండా రవాణా
- డాక్టర్ సర్టిఫికెట్, కనీస నిబంధనలు పాటించని వ్యాపారస్తులు
- రూ.కోట్లలో వ్యాపారం
- మత్తు వీడని పశుసంవర్ధకశాఖ, పోలీస్ సిబ్బంది


పార్వతీపురం వారపు సంతలో రవాణాకు సిద్ధంగా ఉన్న పశువులు

పార్వతీపురంటౌన్:

జిల్లాకేంద్రంలో ప్రతి గురువారం పశువుల సంత జరుగుతుంది. పట్టణ శివారున ఉన్న అగ్రికల్చర్ మార్కెట్ యార్డు ఆవరణలో ఈ సంత దశాబ్దాల నుంచి జరుగుతోంది. ఈ సంతలో ఆవులు, ఎద్దులు, గేదెలు, దున్నపోతులు, గొర్రెలు, మేకల క్రయవిక్రయాలు చేస్తుంటారు. సర్వసాధారణంగా పశువుల సంత అనగానే..రైతులు గుర్తుకొస్తారు. తమ అవసరాలకు ప్రాణాతిప్రాణంగా పెంచుకున్న మూగ జీవాలను విక్రయిస్తుంటారు. జీవన భృతి కోసం ..సాగు కోసం..మరికొందరు రైతులు ఆవే మూగ జీవాలను కొనుగోలు చేస్తుంటారు. ఇలా వేలాది మంది రైతులు..ప్రతి గురువారం నిర్వహించే పార్వతీపురం సంతకు వస్తుంటారు. ఇదే అదునుగా కొందరు పశువుల వ్యాపారులు భారీ సంఖ్యలో పశువులు కొనుగోలు చేస్తూ, ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ప్రతివారం లక్షల్లో వ్యాపారం చేస్తూ.. వేలాది పశువులు కబేళాలకు తరలిస్తున్నారు.

నిబంధనలు పట్టకుండా తరలింపు

మూగ జీవాల అక్రమ తరలింపును అడ్డుకోడానికి ప్రభుత్వం జంతు సంరక్షణ చట్టం-1960, గో సంరక్షణ చట్టం-1977 రూపొందించింది. ఈ చట్టాలను అనుసరించి, పశువులను తరలించే వాహనాలకు రవాణాశాఖ నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. గొర్రెలు, మేకలను 0.3 స్క్వేర్ మీటర్లు, పెద్ద జంతువులను 2 స్క్వేర్ మీటర్ల స్థలం ఉండే వాహనాల్లోనే తరలించాలి. ఆరోగ్యం బాగోలేని పశువులను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించకూడదు. తరలింపులో పశువుల వయస్సు, వాటి బరువును కూడా పరిగణనలోకి తీసుకోవాలి. పెద్ద జంతువుల పక్కన చిన్న జంతువులను పెట్టరాదు. పశువుల తరలింపులో స్థానిక పశు వైద్యుడి నుంచి ధ్రువీకరణ పత్రం పొందాల్సి ఉంటుంది. వాహనాల్లో పశువులకు సరిపడా ఆహారం, నీడ, నీరు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. రవాణాలో గాయపడే పశువులకు ప్రాథమిక వైద్యమందించే అనుభవమున్న వ్యక్తి కూడా ఆయా వాహనాల్లో ప్రయాణించాల్సి ఉంటుంది. ఈ నిబంధనలేవీ పార్వతీపురం కేంద్రం నుంచి పశువులను తరలించే వాహనాల్లో వ్యాపారులు పాటించడంలేదని జంతు ప్రేమికులు మండిపడుతున్నారు.


పశువులకు గాయాలు

నిబంధనలకు విరుద్ధంగా..


నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి పశువులను తరలిస్తున్న దృశ్యం

పశువుల తరలింపులో ఆయా జంతువుల ఆకారాలను బట్టి వాహనాలను వినియోగించాల్సి ఉంటుంది. అందుకు విరుద్ధంగా పార్వతీపురం నుంచి పశువులను తరలించే వ్యాపారులు అనుసరిస్తున్నారు. ఒకే దాహనంలో పదుల సంఖ్యలో పశువులను కుక్కి ఎక్కిస్తున్నారు. ఒక పెద్ద వాహనంలో ఎనిమిది పశువులు పట్టాల్సిన చోట 30 నుంచి 45 పశువులను ఎక్కిస్తున్నారు. అనుమతుల్లేని పశువులు తరలిస్తున్నారు. రెండు మూడు పశువులు పట్టే టాటా ఏస్ వాహనంలో 10 నుంచి 12 వరకూ ఎక్కిస్తున్నారు. చిన్నా పెద్దా తేడా చూడకుండా అన్ని పశువులనూ ఒకే వాహనంలో తరలిస్తున్నారు. దీనివల్ల పెద్ద కొమ్ములు కలిగిన గేదెల వల్ల పక్కనున్న గేదెలు తీవ్ర గాయలపాలవుతుంటాయి. ఒకదాని పక్కన ఇంకోటి పెట్టడం వల్ల తొక్కిసలాటలో చిన్న జంతువులు కాళ్లు విరిగిపోవడం, శరీరం గాయాలవడం జరుగుతోంది. గాయాలైన పశువులకు ప్రాథమిక వైద్యం అందించే పరిస్థితి లేదు. పార్వతీపురం సంతకు ఒడిశాలోని బలిపాడు. ఇతర సంతల నుంచి పశువులు తీసుకువస్తుంటారు. ఇక్కడి సంతలో కొనుగోలు చేసిన పశువులను విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్, తమిళనాడు, కేరళకు తరలిస్తుంటారు. ఇలా వందల కిలోమీటర్ల దూరం పశువులను ఎటువంటి సౌకర్యాలూ లేకుండా తీసుకువెళ్తుంటారు. మేతకానీ, నీరుకానీ లేకుండా మూడు నాలుగు రోజుల పాటు పశువులు ప్రయాణం సాగించాల్సి ఉంటుంది. ఏ భంగిమలో ఉంటే అదే భంగిమలో పశువులను నాలుగు రోజుల అలాగే ఉంచి తీసుకువెళ్తారు.

చట్టాల్లో లొసుగులే వ్యాపారులకు కాసులు

పశువుల అక్రమ రవాణాకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు రూపొందిస్తూనే ఉన్నాయి. ఎన్ని చట్టాలున్నా పశువుల అక్రమ రవాణాకు మాత్రం అడ్డుకట్ట పడడం లేదు. ఇందుకు చట్టంలోని లొసుగులే కారణమని తెలుస్తోంది. స్వాధీనం చేసుకున్న పశువులను సంరక్షించడానికి ప్రతి జిల్లాలో గోశాల ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. మిగిలిన జిల్లాల సంగతేమోగాని, ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఎక్కడా గోశాల లేదు. దీనివల్ల సీజ్ చేసిన వాహనాల్లోని పశువుల సంరక్షణ భారంగా మారుతోంది. దీంతో పట్టుబడిన వాహనాలపై జరిమానా విధించి, పోలీసులు విడిచిపెడుతున్నట్లు సమాచారం. ఇదే వ్యాపారులకు వరంగా మారింది. ఫైన్ కడితే సరి.. పశువుల అక్రమ రవాణాకు అడ్డే లేకుండా పోతోంది.

ఆదాయమే పార్వతీపురం ఏఎంసీ లక్ష్యం..

పశువుల సంత పార్వతీపురం మార్కెట్ యార్డులో జరుగుతుంది. ఈ సంత ద్వారా ఏఎంసీకి ప్రతి వారం భారీగా ఆదాయం వస్తోంది. ప్రతి నెలా సెస్ రూపేణా రూ.50 వేల నుంచి రూ. లక్ష వరకు ఆదాయమొస్తున్నట్లు ఏఎంసీ అధికారులు చెబుతున్నారు.జూన్ నెలకు సంబంధించి, రూ.50,350లు ఆదాయమొచ్చినట్లు తెలిపారు. కాసుల కక్కుర్తిలో పడిన ఏఎంసీ అధికారులు, పశువుల అక్రమ రవాణాపై దృష్టి పెట్టడం లేదు. ఇదేంటని ప్రశ్నిస్తే పశువుల రవాణా అడ్డుకునే బాధ్యత తమది కాదని, పశువైద్యుడు, పోలీసులు, రవాణా, పశు సంవర్ధక శాఖాధికారులదేనని సెలవిస్తున్నారు. కేవలం సెస్ వసూలు చేయడమే తమ బాధ్యత అంటున్నారు.

9 నెలలుగా ఎవరికీ సర్టిఫికెట్ ఇవ్వలేదు..



గత 9 నెలలుగా ఇంతవరకూ ఎవరికీ పశువుల రవాణాకు సంబంధించి ఎటువంటి ధ్రువీకరణ పత్రమూ ఇవ్వలేదు. పశువుల రవాణాలో ఎన్నో నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. వాటిలో పశువుల ఆరోగ్యంపై పశు వైద్యుడిగా తానిచ్చే ధ్రువీకరణ ఒకటి. ఈ ధ్రువీకరణ పత్రం లేకుండా పశువులను తరలించడం చట్ట రీత్యా నేరం. బొలెరో వాహనంలో కేవలం 2 పశువులకు మాత్రమే అనుమతి ఉంది.

– డాక్టర్ ఎస్. మన్మథరావు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి, పార్వతీపురం

క్లుప్తంగా

చందనోత్సవానికి ప్రత్యేక బస్సులు

పార్వతీపురం టౌన్: సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి చందనోత్సవానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ కనకదుర్గ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 30న చందనోత్సవాన్ని పురస్కరించుకుని, అప్పన్నస్వామి నిజరూప దర్శనానికి సింహాచలం వెళ్లే భక్తులకు బుధవారం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 5.30, 6.30, 7.30 గంటలకు బస్సులు పార్వతీపురం డిపోలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చల్లబడిన వాతావరణం

పార్వతీపురం: నాలుగు రోజుల నుంచి భానుడు ఉగ్రరూపం దాల్చడంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. ఆదివారం వాతావరణం కాస్త చల్లబడడంతో ఊపిరి పీల్చుకున్నారు. సాధారణ ఉష్ణోగ్రలు నమోదు కావడంతో ఉపశమనం పొందారు. మరో రెండు రోజులపాటు సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖాధికారులు చెబుతున్నారు.

చలివేంద్రాల ఏర్పాటు

ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లా యంత్రాంగం జిల్లా వ్యాప్తంగా బస్టాండ్, రైల్వేస్టేషన్, ప్రధాన కూడళ్లలో చలివేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ఉపాధి హామీ పథకం వేతనదారులు ఉదయం, సాయంత్రం సమయాల్లో మాత్రమే పనుల్లో పాల్గొనేలా ఆదేశాలు జారీచేశారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులు, వృద్ధులు వీలైనంతవరకు బయటకు వెళ్లకూడదని వైద్యులు సూచిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో గంధం అమావాస్య పూజలు


లక్ష్మీ నృసింహస్వామి వారికి చందనాభిషేకం

పార్వతీపురంటౌన్: పట్టణంలోని లక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో ఆదివారం తెల్లవారుజామున 4గంటల నుంచి గంధం అమావాస్య పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు తిరుపతిప్రసాద్ పండా మాట్లాడుతూ ఈనెల 27, 28, 29 తేదీల్లో చందన అభిషేకాలు, అఖండ దీపారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని చందనాన్ని సమర్పిస్తారని, ఈ నెల 30న లక్ష్మీనృసింహ స్వామి నిజరూప దర్శనం ఉంటుందన్నారు.

మోడుతో.. ఎవరికి మూడుతుందో..!


వెంకంపేట గోరీల జంక్షన్ సమీపంలో మోడు బారిన భారీ వృక్షం

పార్వతీపురం రూరల్: వెంకంపేట గోరీల జంక్షన్ వద్ద ఆర్అండ్బీ రాష్ట్రీయ రహదారిని ఆనుకుని ఉన్న ఓ భారీ చెట్టు ఎండిపోయి కూలేందుకు సిద్ధంగా ఉంది. వేసవిలో వీచే గాలులకు కొమ్మలు విరిగి రహదారిపై రాకపోకలు సాగించే వారిపై పడి ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని స్థానికులు, వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఏదీ నాటి శోభ..!


సత్యనారాయణ స్వామి ఆలయం

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పట్టణంలో శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయాన్ని 160 సంవత్సరాల క్రితం నిర్మించారు. గతంలో ఏ శుభకార్యాలైనా ఆలయంలో సత్యనారాయణ వ్రతాలు వైభవంగా నిర్వహించేవారు. ప్రస్తుతం ఆలయం శిథిలావస్థకు చేరడంతో స్వామి వారికి పూజలు మాత్రమే నిర్వహిస్తున్నారు. వ్రత మంటపాలు, కల్యాణ వేడుక నిర్వహించే ప్రాంతం పూర్తి శిథిలావస్థకు చేరుకోవడంతో నాటి శోభ కరువైందని స్థానికులు, అర్చకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


శిథిలావస్థకు చేరుకున్న వ్రత మంటపాలు

వేసవి తాపానికి ఆయుర్వేద చిట్కాలు


మాట్లాడుతున్న ప్రభుత్వ ఆయుష్ డాక్టర్ హేమాక్షి

సీతానగరం: అధిక ఉష్ణోగ్రతల కారణంగా ప్రజలు వడదెబ్బకు గురి కాకుండా ముందు జాగ్రత్తచర్యగా అయుర్వేదంతో ఉపశమనం పొంద వచ్చని బూర్జ ప్రభుత్వ ఆయుష్ ఆస్పత్రి డాక్టర్ టి.హేమాక్షి అన్నారు. ఈ మేరకు బూర్జ ఆయుష్ ఆస్పత్రిలో పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారికి ఆదివారం ఆమె వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమాక్షి మాట్లాడుతూ ఎండల తీవ్రత, వడగాలుల బారిన పడిన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. వేసవి ఉష్ణోగ్రత కారణంగా శరీరం నీటిశాతాన్ని కోల్పోతుందని దానికి అనుగుణంగా తగుజాగ్రత్తలు తీసుకోవాని లేనిపక్షం లో వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. వడదెబ్బకు గురికాకుండా అయుర్వేద ఔషధాలు,ఇంటి వద్ద చేసుకోగలిగే కొన్ని ఆయుర్వేద చిట్కాలతో ఉపశమనాన్ని పొంద వచ్చన్నారు. సబ్జా గింజలు నానబెట్టి నిమ్మరసం కలిపి అందులో కొంచెం చక్కెర వేసి తాగాలని సూచించారు. మజ్జిగలో జీలకర్ర పొడి చిటికెడు, కొంచెం బ్లాక్ సాల్ట్ వేసి తీసుకోవాలి. వట్టివేరు పొడి చేసి అందులో ధనియాలు పొడి కలిపి కషాయం తీసుకోవాలని చెప్పారు. ఉసిరి పొడర్లో గుంటగలగర ఆకు, పెరుగు కలిపి తలకు పట్టించి గంట తర్వాత స్నానం చేయాలి, ముఖం చర్మంపై పూతగా వేసుకుంటే ఎండకు పొడిబారకుండా ఉంటుందన్నారు. అలాగే ఆయుర్వేద ఔషధాలు, కషాయాలు ముఖ్యంగా దాన్యకపంచక కషాయం, షదంగపానీయం, ద్రాక్షసవలు, దశమూల కషాయాలు వేసవి తాపాన్ని తగ్గిస్తాయన్నారు. తాజా ఆకుకూరలు, కీర దోశ, పుచ్చకాయ, వంటి నీటిశాతం అధికంగా ఉండే ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ, వైద్యుల సూచనలు పాటిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ హేమాక్షి కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పద్మ తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం


పూర్వ విద్యార్థులు

సీతానగరం: సీతానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996-2000లో చదువుకున్న స్నేహితులంతా ఆదివారం జోగింపేట రిసార్ట్స్లో కలిశారు. ఈ సందర్భంగా వారు చదువుకున్న రోజుల్లోని స్మృతులను గుర్తు చేసుకున్నారు. వారంతా కలిసి బాధ్యతాయుతమైన ఉద్యోగులుగా, తల్లిదండ్రులుగా నైతిక విలువలతో అందరూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కష్టకాలంలో స్నేహితులకు అండగా నిలవాలని నిర్ణయించారు. పూర్వపు విద్యార్థులు అనిల్, సంతోష్, సత్యం, సాగర్, ప్రసాద్, రాజేష్, రాధిక, త్రివేణి, సంధ్య, ప్రశాంతి, స్వాతి పాల్గొన్నారు.

ఎస్జీటీలను ప్రధానోపాధ్యాయులుగా నియమించాలి

పార్వతీపురంటౌన్: ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో ఎస్జీటీలకు పదోన్నతి కల్పించి, ప్రధానోపాధ్యాయులుగా నియమించాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్(ఆప్టా) మన్యం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చింతాడ రాము, బి నరసింగ రావు కోరారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫౌండేషన్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి 1:20 ఉండాలని, ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లను నియమించాలని డిమాండ్ చేశారు. వెంటనే పీఆర్సీ కమిషన్ను నియమించి 30శాతం ఐఆర్ ప్రకటించాలని, పాత బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. పెండింగ్ ఉన్న బిల్లులు అన్ని క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు.

రికార్డ్స్ ఆఫ్ రైట్స్తో ప్రయోజనాలు

భామిని: మండలంలోని తివ్వాకొండలపై గల రేగిడి గిరిజన గ్రామంలో అటవీ హక్కుల చట్టంపై ఆదివారం అవగాహన కల్పించారు. వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ.. గ్రామ బౌండరీ పరిధిలో ఉన్న భూమిలో ఉమ్మడి ఆస్తులపైన హక్కు పొందాలన్నారు. అటవీ చిల్లర ఫలసాయంపై హక్కు, పశువులు మేపుకునే స్థలం, చేపలు పట్టుకునే హక్కులు పొందే విధానంపై వివరించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

- కూరగాయల సాగులో జాగ్రత్తలు పాటించాలి
- సమగ్ర యాజమాన్య పద్ధతులు అనుసరించాలి
- నేలసారానికి అనువైన పంటలు వేసుకోవాలి
- సకాలంలో నీరు, ఎరువులు అందించాలి


యాజమాన్య పద్ధతులు అనుసరిస్తూ సాగు చేస్తున్న బీర పంట ఏపుగా పెరిగిన దృశ్యం

గరుగుబిల్లి: సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తూ కూరగాయల సాగు చేపడితే అధిక దిగుబడులు వస్తాయి. నేలసారానికి తగ్గట్టుగా పంటలు వేసుకుంటే బాగా పండుతాయి. దీనికి ఏ రకమైన నేల.. ఏ పంటలకు అనుకూలమనే విషయాన్ని గుర్తెరగాలి. అప్పుడే నేలకు అనువైన పంటలు వేసుకుని లాభాలు ఆర్జించవచ్చని వ్యవసాయ నిపుణులు సలహా ఇస్తున్నారు. ముఖ్యంగా భూసారం, విత్తనాల ఎంపిక, సాగు పద్ధతులు, తెగుళ్ల నివారణపై అవగాహన పెంచుకోవాలని సూచిస్తున్నారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటల ప్రత్యేక రకాలను ఎంపిక చేసుకుని, సాగు చేస్తే అధిక ఆదాయం పొందవచ్చు. అలాగే ఇంటి అవసరాలకు కూడా కూరగాయలను వినియోగించుకోవచ్చు. ముఖ్యంగా నారు, విత్తనం శుద్ధి దగ్గర నుంచి వాటిని నాటుకోవడం, నీరు కట్టడం, ఎరువులు వేయడం, వాటిల్లో గాబు(పిచ్చిమొక్కలు) తీయడం వంటి యాజమాన్య పద్ధతులు అనుసరిస్తే దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని ఏవో ఆర్.విజయభారతి చెబుతున్నారు. ఆమె మాటల్లో మరిన్ని సూచనలు..

పాటించాల్సిన జాగ్రత్తలివే..

- వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా వంగ, టమాటా, మిరప పంటలను షేడ్ నెట్ నీడలోనే పెంచాలి. రసంపీల్చే పురుగుల నివారణకు విత్తనశుద్ధి విధిగా చేయాలి.
- మొక్కలకు నీడ తగిలేలా ఆముదం, మొక్కజొన్న లాంటి పంటలను ఉత్తర, దక్షిణ దిశలో నాటుకుంటే ఫలితం ఉంటుంది.
- వేసవిలో మామిడి, జామ, కొబ్బరి, పామాయిల్ తోటలలో మొదటి మూడు, నాలుగేళ్లు అంతరపంటలుగా బెండ, సొర, బీర, గుమ్మడి, దోస, చిక్కుడు, గోరుచిక్కుడు వంటి కూరగాయల పంటలు వేసుకోవాలి.
- నేలలోని తేమను సంరక్షించే చర్యలు చేపట్టాలి. వీలైనంత ఎక్కువ మోతాదులో సేంద్రియ ఎరువులు వాడాలి.
- నీటి ఆదాకు బిందు(డ్రిప్), తుంపర(స్ప్రింక్లర్) సేద్యాలు అనుసరించాలి.
- టమాటా, పుచ్చపంట సాగులో నీటి యాజమాన్యం సరిగా లేకుంటే కాయలపై పగుళ్లు ఏర్పడతాయి. పగుళ్ల నివారణకు 3 గ్రాముల బోరాక్స్ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- తీగజాతి కూరగాయ పంటల్లో అధిక ఉష్ణోగ్రతకు మగపూలు ఎక్కువగా వస్తాయి. దీని నివారణకు పూతదశలో సిఫార్సు మేరకు మందులు వాడాలి.
- పొటాష్ను సరైన మోతాదులో వాడితే నీటి ఎద్దడిని, చీడపీడలను తట్టుకునే గుణం మొక్కలలో పెరుగుతుంది. కిలో యూరియాకు అరకిలో పొటాష్ను తప్పనిసరిగా వాడాలి.
- యూరియా ఎండ వేడికి త్వరగా ఆవిరి కాకుండా మొక్కకు ఎక్కువ రోజులు అందుబాటులో ఉండేలా 9 కిలోల యూరియాకు ఒక కిలో వేప పిండిని కలిపి వేయాలి.
- పూత, పిందె రాలకుండా టమాటా, వంగ పంటలకు ఒక ఎం.ఎల్ ప్లానోఫిక్స్ మందును ఐదు లీటర్ల నీటిలో కలిపి పూతదశలో వారంలో రెండు సార్లు స్ప్రే చేయాలి.

వేసవిలో సాగుకు అనువైన రకాలివే..

- **టమాటాలో సాధారణ రకాలు:** మారతం, ఆర్కవికాస్
- **టమాటాలో సంకరజాతి రకాలు:** రష్మి, నవిన్, అవినాష్-2, లక్ష్మి
- **బెండలో సాధారణ రకాలు:** అర్క, అనామిక
- **బెండలో సంకరజాతి రకాలు:** వర్ష, మహికో-10, ప్రియ, సుప్రియ

డిప్యూటీ స్పీకర్ మాటలు నిలకడలేనితనానికి నిదర్శనం


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

సాలూరు: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుపై డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు వ్యక్తిగత దూషణలకు దిగడం ఆయన రాజకీయ నిలకడలేనితనాన్ని తెలియజేస్తోందని సీపీఎం పేర్కొంది. ఈ మేరకు ఆదివారం పట్టణానికి చెందిన సీపీఎం జిల్లా కార్యదర్శవర్గ సభ్యుడు ఎన్వైనాయుడు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో పేదల నివాసాలను ఎక్కడ కూల్చినా సీపీఎం వారికి అండగా ఉంటుదని స్పష్టం చేశారు. ఉండి నియోజకవర్గంలోనూ అదే చేశామన్నారు. ఉండి నియోజకవర్గంలో పేదల ఇళ్లు కూల్చివేస్తే సీపీఎం అడ్డుకుందని తెలిపారు. పేదలకు అండగా ఉన్న సీపీఎం నాయకులపై రఘురామ కృష్ణం రాజు చిందులు వేయడం సరికాదన్నారు. శ్రీనివాసరావుపై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు సిద్ధపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బుజ్జి, తనూజ, రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఇదేం 'చెత్త' పాలన..!


డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పార్వతీపురం: పార్వతీపురం మున్సిపాలిటీలో ఇదేం 'చెత్త పరిపాలన అని కాంగ్రెస్ పార్టీ, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి నాయకుడు వి. దాలినాయుడు ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం పార్వతీపురం మున్సిపాలిటీలోని రాయగడ రోడ్డులో గల చెత్త డంపింగ్ యార్డ్ వద్ద అంతర్ రాష్ట్ర రహదారిపై వేసిన చెత్త డంపింగ్ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మున్సిపల్ పాలన గాడి తప్పిందని ఆరోపించారు. దానికి ఉదాహరణగా అంతరష్ట్రట రహదారిపై చెత్త డంపింగ్ను చెప్పుకోవచ్చన్నారు. వేసవిలోనే అంతర్రాష్ట్ర రహదారిపై చెత్తను గడంపింగ్ చేస్తున్నారని, పార్వతీపురం మున్సిపాల్టీగా అవతరించినప్పుడు రాయగడ రోడ్డులో ఏర్పాటు చేసిన చెత్త డంపింగ్ యార్డు, ఇప్పుడు పట్టణంలో పెరగడం వల్ల ప్రతిరోజూ మున్సిపాల్టీలో తయారయ్యే చెత్తను డంపింగ్ చేసేందుకు స్థలం సరిపడడం లేదన్నారు. దీంతో పక్కనే ఉన్న గోపసాగరంలో దాదాపు మూడు ఎకరాల మేర చెత్త వేసి కబ్బా చేశారని, చెరువుల కబ్జాలను అడ్డుకోవాల్సిన మున్సిపాల్టీ చెరువులు కబ్జా చేయం హాస్యాస్పదంగా ఉందన్నారు. సుమారు 32 ఎకరాల విస్తీర్ణం కలిగిన గోపసాగరం కబ్జా చేసి చెత్త వేయడం వలన అందులో చేపలు మృత్యువాత పడుతున్నాయని, చెత్తనీరు పొలాల్లోకి రావడంతో ఆయకట్టు రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సిరిసిపల్లి సాయి శ్రీనివాస్, సాలూరు నియోజకవర్గం ఇన్చార్జ్ గేదెల రామకృష్ణ, జిల్లా నాయకులు కోలా కిరణ్కుమార్, మండల అధ్యక్షుడు తీళ్ల గౌరీ శంకరరావు, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా కార్యదర్శి చుక్క చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ రోడ్డు నిర్మాణం ప్రారంభం


చినభోగిలి వద్ద ఆరంభించిన అండర్ గ్రౌండ్ రోడ్డు పనులు

సీతానగరం: మండలంలోని చినభోగిలి-మక్కువ రోడ్డులో రైల్వే అండర్గ్రౌండ్ బీటీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. చినభోగిలి- మక్కువ రోడ్డులో రైల్వే ట్రాక్ కింద నుంచి బీటీ రోడ్డు నిర్మాణానికి పనులు ప్రారంభించారు. ఏపీ రాష్ట్ర రహదారి మక్కువ-అజ్జాడ రోడ్డులో చినభోగిలి వద్ద రైల్వే ట్రాక్పై పెరిగిన ట్రెన్లు రాకపోకలు, నూతనంగా పెరుగుతున్న ట్రాక్ల కారణంగా గంటల తరబడి వందలాది వాహనాలు, వాహన చోదకులు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా అండర్గ్రౌండ్ బీటీ రోడ్డు నిర్మాణం చేయాలని సంకల్పించారు. ఈ మేరకు అప్పటి ప్రభుత్వాలు 2021-22 ఆర్థిక సంవత్సరంలో చినభోగిలి సమీపంలో బక్కుపేట- చినభోగిలి, చినభోగిలి కాలనీ-ఆర్అండ్బీ వంతెన సమీపంలో అండర్గ్రౌండ్ రోడ్డు నిర్మించాలని రైల్వేశాఖ ప్రణాళికలు తయారు చేసింది.

తాజాగా రైల్వేశాఖ మూడో లైన్ట్రాక్ నిర్మాణం పూర్తి కావస్తున్న నేపథ్యంలో అండర్గ్రౌండ్ రోడ్డు పనులను ప్రారంభించింది. రోడ్డు పనులు పూర్తయితే రైల్వే గేటు పడిన సమయంలో గంటల తరబడి నిలిచిపోయిన వాహనాల వల్ల కాలుష్యం పెరగడం, రోడ్డు ప్రమాదాలు జరగ డం వంటి సమస్యలు తీరనున్నాయి.

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఒత్తిడి లేని నాణ్యమైన విద్య

జియ్యమ్మవలస రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే ఒత్తిడి లేని నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని, బడిఈడు పిల్లలను దగ్గరలోని ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు ప్రచారం నిర్వహిస్తున్నారు. మండలంలోని చినమేరంగి, అల్లువాడ, తుంబలి, దాసరిపేట, లింగాలవలస గ్రామాల్లో చినమేరంగి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాలకు సంబంధించి, ఆ పాఠశాల సిబ్బంది ఆదివారం క్యాంపెయిన్ (అడ్మిషన్ డ్రైవ్) నిర్వహించారు. ప్రభుత్వ విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు. సుశిక్షితులైన ఉపాధ్యాయులచే కార్పొరేట్ పాఠశాలల్లో కన్నా మెరుగైన విద్య ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలకు అందించడం జరుగుతుందన్నారు. బడిలో చేరాలనుకునే పిల్లలంతా జూన్ 12వ తేదీలోగా చేరాలన్నారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

గరుగుబిల్లి/గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రాల్లోని శాఖా గ్రంథాలయాల్లో సోమవారం నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్లు ఎస్.మధుసూదనరావు, డి.సుకన్యలు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జూన్ 6వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠనం, చిత్రలేఖనం, పుస్తక సమీక్ష, క్రాఫ్ట్, క్విజ్ పోటీలు వంటి అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నామన్నారు. 45 రోజుల పాటు జరిగే ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులనువారు కోరారు.